

ప్రతిఒక్క ఓటరుకూ అవగాహన కల్పించాలి

రిటర్నింగ్ అధికారి స్వామినాయుడు

ప్రజాశక్తి - ఆచంట

ఇవిఎంల ద్వారా ఓటు వినియోగించుకునే పద్ధతిపై ప్రతిఒక్క ఓటరులోనూ అవగాహన కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆచంట, పోడూరు మండలాలకు చెందిన రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులకు సి-విజిల్ యాప్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సి-విజిల్ యాప్‌లో అభ్యర్థులు, వారి అనుచరులు మద్యం, డబ్బు పంపిణీ చేస్తున్న ఫొటోలు, వీడియోలు తీసి పంపించవచ్చన్నారు. ఈ యాప్ ద్వారా వచ్చిన వాటిని అధికారులు పరిశీలించి సంబంధిత అభ్యర్థులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒలు నరసింహ ప్రసాద్, రోహిణి, తహశీల్దార్ బి.పి.శెట్టి, డిప్యూటీ తహశీల్దార్ రాంప్రసాద్‌రాజు, నాగిరెడ్డి, నరసింహారావు పాల్గొన్నారు.

'కూటమి'లో కంగారు..!



- ఎంపీ అభ్యర్థుల ఎంపికపై వీడని ఉత్కంఠ
- నరసాపురం, ఏలూరు సీట్లు ఏ పార్టీకో తెలియక గందరగోళం
- అభ్యర్థుల ఎంపికలో జాప్యంపై కూటమి నేతల్లో అసంతృప్తి
- ముమ్మరంగా వైసిపి ఎంపీ అభ్యర్థుల ప్రచారం
- పోలవరం, కైకలూరు స్థానాల్లో బరిలో నిలిచేదెవరో?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


టిడిపి, జనసేన, బిజెపి కూటమిలోని నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర అలజడి నెలకొంది. ప్రత్యర్థి పార్టీ వైసిపికి చెందిన ఎంపీ అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ కూటమి నుంచి పోటీచేసే ఎంపీ అభ్యర్థులను ఇప్పటికీ ప్రకటించకుండా జాప్యం చేయడంపై కూటమిలోని పార్టీల నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎంపీ అభ్యర్థులెవరో తేల్చండంటూ ఆయా పార్టీల నాయకులు అధిష్టానం వద్ద మొరపెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. పొత్తుల్లో భాగంగా నరసాపురం స్థానంలో బిజెపి అభ్యర్థి, ఏలూరు స్థానం నుంచి టిడిపి అభ్యర్థి పోటీ చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది. టిడిపి, జనసేన, బిజెపి పొత్తు కుదిరి చాలా రోజులైంది. ఇప్పటికీ ఎంపీ అభ్యర్థుల ఎంపిక మాత్రం కొలిక్కిరాలేదు. అధికార పార్టీ వైసిపి ఎంపీ అభ్యర్థులను ముందుగానే ప్రకటించింది. ఏలూరు ఎంపీ స్థానానికి కారుమూరి సునీల్‌కుమార్, నరసాపురం ఎంపీ స్థానానికి గూడూరి ఉమాబాలను వైసిపి ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. దాదాపు నెలరోజులుగా వీరు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. టిడిపి కూటమి మాత్రం ఎంపీ అభ్యర్థులను ఇప్పటికీ తేల్చని పరిస్థితి నెలకొంది. నరసాపురం బిజెపి ఎంపీ అభ్యర్థిగా కనుమూరి రఘురామకృష్ణంరాజు పోటీ చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఆయన ప్రస్తుతం ఏ పార్టీలోనూ లేరు. బిజెపి రఘురామకృష్ణంరాజుకు టిక్కెట్ ఇచ్చేందుకు సుముఖంగా లేదని తెలుస్తోంది. ఆ కారణంగానే అభ్యర్థులను ఇప్పటికీ ప్రకటించలేదని చెబుతున్నారు. ఒకవేళ బిజెపి ఆయనకు టిక్కెట్ ఇవ్వకపోతే ఏలూరు ఎంపీ స్థానం బిజెపికి కేటాయించి నరసాపురంలో టిడిపి తరుపున రఘురామకృష్ణంరాజు బరిలోకి దిగే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో ఆయా పార్టీల నాయకుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. ఏలూరు ఎంపీ అభ్యర్థిగా టిడిపి నుంచి పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. గోరుముచ్చు గోపాల్‌యాదవ్, పుట్టా మహేష్‌యాదవ్, ఐపిఎస్ అధికారి సత్యనారాయణగౌడ్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ఎంపీ అభ్యర్థుల విషయంలో టిడిపి కూటమి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే అభిప్రాయం ఆయా పార్టీల్లోని నాయకులు, కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. ఎంపీ అభ్యర్థులకు తోడుగా ఎంపీ అభ్యర్థి సైతం ప్రచారంలో ఉంటే బాగుంటుందని, అలా లేకపోవడం కొంత ఇబ్బందిగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏలూరు బిజెపి ఎంపీ అభ్యర్థిగా తానే పోటీ చేస్తానని గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి) బహిరంగంగానే చెబుతున్నారు. బిజెపి నాయకులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి 'తపనకే టిక్కెట్ ఇవ్వాలంటూ' మాట్లాడించిన సంగతి తెలిసిందే. బిజెపి వ్యవహారంతోనే లోక్‌సభ అభ్యర్థుల ఎంపికలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయనే భావన వ్యక్తమవుతోంది.

పోలవరం, కైకలూరు బరిలోకి దిగేదెవరో?

కూటమిలో భాగంగా పోలవరం టిక్కెట్ జనసేనకు, కైకలూరు టిక్కెట్ బిజెపికి ప్రచారం ఉంది. అన్ని నియోజకవర్గాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం సాగుతున్నప్పటికీ పోలవరం, కైకలూరు స్థానాల్లో మాత్రం ఇప్పటికీ అభ్యర్థులు ఎవరనేది తేలని పరిస్థితి ఉంది. కైకలూరులో బిజెపి తరుపున సోము వీర్రాజు పోటీ చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది. మరోవైపు మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ పేరు సైతం వినిపిస్తోంది. పోలవరం జనసేన అభ్యర్థిగా చిర్రి బాలరాజు పేరు వినిపిస్తున్నా ఆర్థిక కారణాల రీత్యా ఆయనకు టిక్కెట్ ఇచ్చే అవకాశం లేదని చెబుతున్నారు. దీంతో పోలవరం, కైకలూరు అభ్యర్థులను తేల్చాలని స్థానిక నాయకులు, కార్యకర్తలు ముక్తకంఠంతో తమ పార్టీ అధిష్టానాలను కోరుతున్నారు.

గెలిస్తే మీకెంత.. ఓడితే మాకెంత..!

రోజురోజుకీ ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలో బిజీబిజీగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో పందెంరాయుళ్లు తమ జోరు పెంచారు. అభ్యర్థుల గెలుపోటములు.. పార్టీల బలాబలాలు.. సాధించే మెజార్టీలపై ఎన్నికల ఆరంభంలోనే పందేలు ప్రారంభించారు. అభ్యర్థులు గెలిస్తే మీకెంత.. ఓడిపోతే మాకెంత అనే విధంగా పందేలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో పందెంరాయుళ్ల రాజకీయం రసవత్తరంగా మారింది.



- ఎన్నికల వేళ జోరందుకున్న పందేలు
- అనూహ్యంగా నామినేషన్లు వేయకుండానే పందేలు
- అభ్యర్థుల ఎంపిక నుంచి గెలుపోటములపైనా పందేల జాతర
- సెగలు పుట్టిస్తున్న జిల్లా రాజకీయం

ప్రజాశక్తి - భీమవరం

పందేలకు పెట్టింది పేరు పశ్చిమగోదావరి జిల్లా. ఇక్కడ అనేక సందర్భాల్లో వివిధ రకాల పందేలు నిత్యం సాగుతూనే ఉంటాయి. ఇక ఎన్నికలు వస్తే పందెంరాయుళ్లు బిజిబిజీనే. సాధారణ ఎన్నికలకు అటు రాజకీయ పార్టీలతోపాటు ఇటు అధికార యంత్రాంగం కూడా సిద్ధమైంది. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదలైంది. ఉమ్మడి జిల్లాలో ఎంపీ అభ్యర్థులు, రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతిపక్ష కూటమి అభ్యర్థులు మినహా మిగిలిన చోట్ల అభ్యర్థులను సైతం అధికార, ప్రతిపక్షాలు ప్రకటించేశాయి. అభ్యర్థులు సైతం ప్రజాక్షేత్రంలో ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. 2014 ఎన్నికల్లో టిడిపి జిల్లాలో క్లీన్‌స్వీప్ చేసింది. 2019 ఎన్నికల్లో 13 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలను వైసిపి గెలుచుకుంది. రెండు స్థానాలతో టిడిపి సరిపెట్టుకుంది. ఆ ఎన్నికల్లో రూ.కోట్లలో పందేలు సాగాయి. ప్రస్తుతం ఈ ఎన్నికల్లో పూర్వ వైభవాలను సాధించేందుకు పార్టీలు తంటాలు పడుతున్నాయి. అభ్యర్థుల ఎంపిక దగ్గర నుంచి పార్టీ స్థితిగతులు, బలాబలాలు, ఆర్థిక, అంగబలం, సామాజిక తరగతుల వారీ బలాలను చూసి మరి అభ్యర్థులను బరిలోకి దింపారు. ఈ నేపథ్యంలో వీటిని అదునుగా చేసుకుని పందెంరాయుళ్లు రాజకీయ వ్యూహాలను రచించి మరీ పందేలు ప్రారంభించారు. అభ్యర్థుల పోటీ ఖర్చుకుపైనే పందేలు సాగుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే పందెంరాయుళ్లు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. ఎన్నికల ఆరంభంలోనే పందేలు జోరందుకున్నాయంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ ఏడాది సంక్రాంతి కోడి పందేలతో మొదలైన బెట్టింగ్‌లు తర్వాత క్రికెట్ మ్యాచులపై సాగాయి. ప్రస్తుతం పందెంరాయుళ్ల దృష్టి సార్వత్రిక ఎన్నికలపై పడింది. గతంలో పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు, తరువాత కౌంటింగ్ వరకూ గెలుపోటములపైనే పందేలు సాగేవి. ప్రస్తుతం పందేల ట్రెండ్ మారింది. అభ్యర్థుల ఎంపిక దశ నుంచే పందేలు సాగుతుండటం గమనార్హం. టిడిపి, జనసేన అభ్యర్థులు ఎన్ని స్థానాల్లో విజయం సాధిస్తారు, ఏఏ నియోజకవర్గాలు కేటాయిస్తారు, అసలు పొత్తు ఉంటుందా, ఉండదా, పవన్‌కల్యాణ్ భీమవరంలో పోటీ చేస్తారా, చేయరా అంటూ రకరకాల పందేలు జోరుగా సాగాయి. అలాగే ఉండి టిడిపి అభ్యర్థిత్వంపైనా బెట్టింగులు సాగాయి. సుమారు రూ.ఐదు కోట్ల పందెం ఇక్కడ జరిగిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నరసాపురం ఎంపీ స్థానానికి టిడిపి కూటమి నుంచి ఏ పార్టీ బరిలో ఉంటుందనే అంశంపైనా భారీగా పందేలు జరిగాయి. ప్రస్తుతం జిల్లాలో ఏ పార్టీ ఎక్కువ సీట్లు దక్కించుకుంటుందనే అంశంపై పందేలు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలిసింది.

గెలిచే స్థానాలపైనే ప్రధాన దృష్టి

జిల్లాలో పందెంరాయుళ్లు అభ్యర్థులు గెలిచే స్థానాలపైనే కేంద్రీకరించినట్లు తెలిసింది. అభ్యర్థుల బలాబలాలు, ఆర్థిక పరిస్థితులు, జనాదరణ, పార్టీ స్థితిగతులు వంటి అంశాలను పరిశీలించి పందేలకు తెర తీసినట్లు సమాచారం. ఇప్పటికే నరసాపురంలో జనసేన టిక్కెట్ బొమ్మిడి నాయకర్‌కు దక్కుతుందని పందెం గెలిచి పందెంరాయుళ్లు ఉత్సాహంలో ఉన్నారని తెలిసింది. ఈ నేపథ్యంలో చాలామంది గెలిచిన మొత్తాన్ని జనసేన అభ్యర్థులపై పందెం పెట్టేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేస్తుండగా రెండు చోట్ల కచ్చితంగా ఈ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఒక పందెం నడుస్తుంటే, మూడు చోట్లా ఆ పార్టీదే గెలుపు అని రెండో పందెం జరిగిందని సమాచారం. ఇదిలా ఉంటే ప్రధానంగా అధికార పార్టీ అభ్యర్థులు గెలిచే స్థానాలపైనా జోరుగా పందేలు సాగుతున్నట్లు తెలిసింది. గత ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో గెలిచిన అభ్యర్థులపై భారీ స్థాయిలో పందేలు వేస్తున్నట్లు సమాచారం. ఆచంట వైసిపి అభ్యర్థి గెలుపుపై రూ.8 కోట్లు వరకు పందేలు వేసినట్లు తెలిసింది. భీమవరం వైసిపి అభ్యర్థిపైనా భారీగా పందెం జరిగినట్లు ప్రచారం సాగుతోంది. తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు వంటి నియోజకవర్గాల్లో స్థానిక పరిస్థితులు బట్టి పందేలు సాగుతున్నట్లు సమాచారం. మరోవైపు ప్రజానాడి తెలుసుకునేందుకు పందెంరాయుళ్లు గ్రామాల్లో తిరుగుతున్నారు. మరికొందరు సర్వేలు కూడా చేయిస్తుండటం గమనార్హం.

9 మంది వాలంటీర్లపై వేటు

అంతా ఉణుదుర్రు వారే

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల ప్రచారంలో పాల్గొని పలు అభియోగాలు ఎదుర్కొన్న తొమ్మిది మంది వాలంటీర్లపై వేటు పడింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ ఆ తొమ్మిది మంది వాలంటీర్లను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉండి మండలం ఉణుదుర్రులో వాలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు రుజువు కావడంతో సార్వత్రిక ఎన్నికల నియమావళి ఉల్లంఘున కింద తొమ్మిది మంది వాలంటీర్లను తొలగించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై వాలంటీర్లకు సంబంధిత మండల అధికారులు పలు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారని తెలిపారు. వాలంటీర్లు రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, ఎన్నికల ప్రచారంలో పాల్గొన కూడదని తెలియజేశారని పేర్కొన్నారు. అయినప్పటికీ ఉణుదుర్రు గ్రామ సచివాలయంలోని వాలంటీర్లు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నట్లుగా ఫొటోలతో సహా రుజువు కావడంతో విచారణ అనంతరం వారిని తొలగించామని సుమిత్ కుమార్ తెలిపారు.

క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలి



మాట్లాడుతున్న సుమిత్‌కుమార్

ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎంసిసి బృందాలు క్షేత్రస్థాయిలో నిరంతరం విస్తృతంగా పర్యటించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సి-విజిల్ ద్వారా అందే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పెండింగు లేకుండా సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సంబంధిత జిల్లా అధికారులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో జెసి ప్రవీణ్ ఆదిత్యతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిష్పక్షపాతంగా మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు. చెక్‌పోస్టుల నుండి ఎన్ని ఫిర్యాదులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ప్రతి క్షణం పర్యవేక్షిస్తూ ఎక్కడా ఉల్లంఘునలకు తావులేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అందిన పిర్యాదులపై తక్షణం విచారణ చేసి తీసుకున్న చర్యలపై పూర్తిస్థాయి నివేదికలు సమర్పించాలన్నారు. సి-విజిలెన్స్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను పరిశీలించి, అందుకు సంబంధించి తీసుకున్న చర్యలను నివేదించాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘునపై అందిన ఫిర్యాదులను నియోజకవర్గస్థాయిలోనే పరిష్కరించాలని, అప్పుడే ప్రజల్లో అధికారులపై మరింత విశ్వాసం పెరుగుతుందని అన్నారు. సమావేశంలో ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్, జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ కానాల సంగీత్‌మాధుర్, సంబంధిత జిల్లా అధికారులు, ఎన్నికల సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

మహిళా పోలీసులకు ఆగిన బందోబస్తు విధులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మహిళా పోలీసులకు పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు విధులను బుధవారం ఉదయమే నిలిపివేశారు. 'పోలీస్ శాఖ రూటే వేరు 'అంటూ బుధవారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి పోలీస్ అధికారులు స్పందించారు. డిజిపి ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మహిళా పోలీసులకు 'పది' పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు విధులు కేటాయించిన సంగతి తెలిసిందే. దీనిపై డిజిపి ఉత్తర్వులను గుర్తు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా విధులు కేటాయించిన అంశాన్ని ప్రజాశక్తి ప్రచురించింది. దీంతో బుధవారం ఉదయమే బందోబస్తు విధులు నిలుపుదల చేస్తున్నట్లు మహిళా పోలీసులకు మెసేజీలు వెళ్లిపోయాయి. దీంతో విధులకు వెళ్లే క్రమంలో అధికారుల నుంచి వచ్చిన మెసేజీలను చూసుకుని మహిళా పోలీసులంతా హర్షం వ్యక్తం చేశారు. ఇకనుంచైనా డిజిపి ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని అంతా కోరుకుంటున్నారు.

పలు చోట్ల చిరుజల్లులు

ప్రజాశక్తి - ఆచంట

ద్రోణి ప్రభావంతో మండలంలో బుధవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో జనం కొద్దిసేపు ఆందోళనకు గురయ్యారు. వారం రోజులుగా మండలంలో రాత్రిపూట చలిగాలులు, మధ్యాహ్నం పూట ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడి జనం సేదతీరారు.


పాలకొల్లు: ఉపరితల ఆవర్తన ప్రభావంతో పాలకొల్లు ప్రాంతంలో ఉదయం నుంచి చలిగాలులు వీస్తున్నాయి. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడ్డాయి. సాయంత్రం చలిగాలుల తీవ్రత మరింత పెరిగింది. గత పక్షం రోజులుగా ఎండ ప్రభావంతో సతమతమవుతున్న ప్రజలు చలిగాలులతో సేదతీరారు. అయితే రబీ పంట ప్రస్తుతం ఈనిక దశలో ఉంది. చలిగాలులకు ఎదిగిన పంట పడిపోతుందేమో అని కొందరు రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఆచంటలో కురుస్తున్న వర్షం

ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి : జెసి

ఉండి: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతిఒక్కరూ తు.చా తప్పకుండా పాటించాలని ఉండి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. బుధవారం సాయంత్రం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు ఏర్పాటు చేయరాదన్నారు. ఏ వాలంటీరైనా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 18 సంవత్సరాలు నిండని చిన్నారులను ఎన్నికల ప్రచారంలోకి అనుమతించరాదని, అనుమతిస్తే ఎన్నికల కోడ్ ఉల్లంఘున కింద కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా తమ ఇళ్ల వద్ద రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు బ్యానర్లు ఏర్పాటు చేసుకోవాలంటే తప్పకుండా అధికారుల అనుమతులు తీసుకోవాలని సూచించారు.



పాలకోడేరు మండలం మోగల్లులో..

మరోసారి ఎంఎల్‌ఎగా గెలిపించండి


ఉండి మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని, స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి వస్తున్న తనను మరోసారి ఎంఎల్‌ఎగా గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థి, ఉండి మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) అన్నారు. పెదఅమిరంలోని జైన్ ఆలయంలో కుటుంబ సమేతంగా పూజలు జరిపారు. అనంతరం ప్రచారం నిర్వహిచంఆరు. తొలుత శివరామరాజు కార్యాలయం వద్ద శివరామరాజు సతీమణి అరుణ హారతి ఇచ్చి నుదుటిపై వీర తిలకందిద్దారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ తాను గత 20 సంవత్సరాలుగా టిడిపి కోసం కష్టపడి పని చేశానన్నారు. అందువల్లే రెండుసార్లు ఎంఎల్‌ఎగా తనను గెలిపించారని తెలిపారు. తనకు ఒక్క మాట కూడా చెప్పకుండా టిడిపి టిక్కెట్ రామరాజుకు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉండి ప్రజల సూచనల మేరకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని స్పష్టం చేశారు.

పాలకోడేరు: 20 ఏళ్లపాటు ఎంతో కష్టపడి టిడిపికి సేవ చేసినప్పటికీ తనను కనీసం పట్టించుకోలేదని, రాబోయే ఎన్నికల్లో ఉండి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న తను ఎంఎల్‌ఎగా మరోసారి గెలిపించాలని మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) కోరారు. పెదఅమిరం జైన్ ఆలయంలో దర్శన అనంతరం బుధవారం ఆయన ప్రచారం ప్రారంభించారు. అక్కడ నుంచి క్యాంపు కార్యాలయం మీదుగా భీమవరం, విస్సాకోడేరు, గొరగనమూడి, పెన్నాడ, శృంగవృక్షం, కొండేపూడి, వేంద్ర, మోగల్లు గ్రామం వరకు కార్లలో శివరామరాజు అనుచరులు అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. శివ అభిమానులు, మహిళలు పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడారు. నియోజకవర్గంలో ఏ ఇంటికి వెళ్లినా ఘన స్వాగతం వ లుకు తు న్నార న్నారు. ఉండితో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. నాకు ఒక్క మాట కూడా చెప్పకుండా ఉండి నియోజకవర్గం సీటు ం ా వ ు ం ా జు క ు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉండి ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగి సాంబశివరాజు, మోగల్లు మాజీ సర్పంచి పెనుమత్స శివరామరాజు (రాంబాబు), భూపతిరాజు రాంబాబు, భూపతిరాజు శ్రీనివాసరాజు, గొట్టుముక్కల సాయివర్మ, బలరామరాజు, కనుమూరి సతీష్‌రాజు, బుద్ధరాజు పద్మావతి, రవి రాజు, బి.రవిబాబు పాల్గొన్నారు.

ఉండి: స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు మండలంలోని కలిగొట్ల గ్రామంలో బుధవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గానికి 10 సంవత్సరాలు ఎంఎల్‌ఎగా సేవలందించానని, శివ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పలు సేవలందించానని గుర్తు చేశారు.



కాళ్ల మండలంలో..

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

ప్రజాశక్తి - భీమవరం

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మూడోరోజు బుధవారం నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షకు 665 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 21,238 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 20573 మంది హాజరయ్యారరని డిఇఒ ఆర్.వెంకటరమణ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 96.87 శాతం హాజరు నమోదైంది. ఎస్ఎస్‌సి (ఎపిఒఎస్ఎస్) పబ్లిక్ పరీక్షలకు 628 మంది విద్యార్థులకుగాను 558 మంది హాజరయ్యారు. 70 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షకు 1303 మంది విద్యార్థులకుగాను 1202 మంది విద్యార్థులు హాజరయ్యారు. 101 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసూ నమోదు కాలేదని డిఇఒ వెంకటరమణ తెలిపారు.

నరసాపురం: పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖాధికారి పి.పుష్పరాజ్యం తెలిపారు. బుధవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్ష 9 సెంటర్లలో మొత్తం 1,761 మందికి గాను 1,719 మంది హాజరయ్యారని తెలిపారు. 42 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 అమలు చేశారు. ఎల్‌బి.చర్లలోని గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాన్ని నరసాపురం రూరల్ సిఐ కె.గోవింద్‌రాజు తనిఖీ చేశారు.

ఉండి : మండలంలోని ఉండి ఎ, ఉండి బి, ఎన్ఆర్‌పి అగ్రహారం, ఉప్పులూరు, యండగండి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామని ఎంఇఒ బి.జ్యోతి తెలిపారు. ఇంగ్లీష్ పరీక్షకు సంబంధించి 628 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 574 మంది విద్యార్థులు హాజరయ్యారని, 54 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

మొగల్తూరు : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మూడో రోజు ఇంగ్లీష్ పరీక్ష ఆరు పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగినట్లు ఎంఇఒ యు.శ్యామ్యూల్ జాన్ తెలిపారు. పరీక్షలకు 851 మంది విద్యార్థులకు గాను 820 మంది హాజరయ్యారని తెలిపారు. 31 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

తాడేపల్లిగూడెం : బుధవారం పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఎంఇఒ పిఎంకె.జ్యోతి తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణం, మండలం కలిపి 13 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 2,548 మంది విద్యార్థులకు గాను 2,410 మంది హాజరయ్యారని, 138 మంది గైర్హాజరయ్యారని ఎంఇఒ.జ్యోతి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.

పెనుగొండ : పదో తరగతి పరీక్షలు మండలంలోని 7 పరీక్షా కేంద్రాల్లో జరగనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి సుభాకర్ తెలిపారు. ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించగా మొత్తం 1,129 మంది విద్యార్థులు అయితే మొదటిరోజు 976 మంది విద్యార్థులు హాజరయ్యారు. 153 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఆచంట: పదో తరగతి పరీక్షలు బుధవారం మండలంలో ప్రశాంతంగా సాగాయి. ఆచంట, కొడమంచిలి, వల్లూరు, ఆచంట వేమవరంల్లోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు ఇంగ్లీష్ పరీక్ష రాశారు. ఈ పరీక్షకు 540 మందికిగాను 528 మంది విద్యార్థులు హాజరయ్యారు. మరో 12 మంది గైర్హాజరైనట్లు ఎంఇఒ ఎ.ఉషారాణి తెలిపారు. ప్రయివేటు విద్యార్థులు 37 మందికిగాను 17 మంది హాజరవ్వగా 20 మంది గైర్హాజరయ్యారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ వెంకటరమణ

మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి - మొగల్తూరు

మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వరాదని ఎస్ఐ కె.వెంకటరమణ వాహన యజమానులకు, తల్లిదండ్రులకు హెచ్చరించారు. బుధవారం మొగల్తూరులోని పెనుమత్స రంగరాజు జెడ్పి ఉన్నత పాఠశాలలో ద్విచక్ర వాహనాలు వేసుకొచ్చిన విద్యార్థులకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల నిమిత్తం కేంద్రాలకు ద్విచక్ర వాహనాలు వేసుకొస్తున్నారన్నారు. మైనర్లు అయిన పిల్లలకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

దళితవాడల అభివృద్ధికి కృషి చేస్తా

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - ఉండి

తాను వచ్చే ఎన్నికల్లో రెండోసారి ఎంఎల్ఎగా విజయం సాధిస్తే దళితవాడల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మహదేవపట్నంలో గ్రామ అధ్యక్షులు వనిమా శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండో రోజు ప్రచార కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు మాట్లాడారు. కూటమి అధికారం చేపడితే దళితవాడల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వైసిపి అధికారం చేపట్టిన నాటి నుంచి దళితవాడల్లో చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. జగన్ అధికారం చేపట్టిన తర్వాత ఎస్‌సిలకు రావాల్సిన సంక్షేమ పథకాలు తొలగించి వారికి తీరని అన్యాయం చేశాడని విమర్శించారు. గ్రామ అధ్యక్షులు వనిమా శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం టిడిపిలో భారీ సంఖ్యలో దళితులు చేరగా వారికి ఎంఎల్ఎ రామరాజు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : ఎప్పుడూ ప్రజల్లో ఉండి వారి సమస్యలను ఆలకించే ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును మంచి మెజార్టీతో గెలిపిస్తామని ప్రజలు ఎదురొచ్చి చెబుతున్నారని ఎంఎల్ఎ రామానాయుడు సతీమణి నిమ్మల సూర్యకుమారి తెలిపారు. మండలంలోని పెద్దమామిడిపల్లి, దిగమర్రు గ్రామాల్లో ఆమె టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. రామానాయుడును గెలిపించాలని కోరారు. గ్రామాల్లో అభివృద్ధి గత టిడిపి హయాంలో జరిగినవేనని, ఈ ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధితోపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవచేసే రామానాయుడును గెలిపించుకుంటేనే మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు బండి పెద్దిరాజు, గుబ్బల కృష్ణమోహన్, పరువు వెంకటరమణ, బండి పెద్దిరాజు, బండి మల్లేశ్వరరావు, దేవకృష్ణ, కోడి విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు

ప్రజాశక్తి - నరసాపురం

ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని డిప్యూటీ తహశీల్దార్ ఎం.నిర్మలాజ్యోతి అన్నారు. బుధవారం శ్రీవైన్ కళాశాలలో విద్యార్థులకు నెహ్రూ యువకేంద్రం వారు నిర్వహించిన ఇంటెన్సివ్ ఓటర్ అవేరన్స్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన వారు అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. మనతో పాటు మన చుట్టు పక్కల వారి చేత ఓటు వేయించాలన్నారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగకూడదన్నారు. ఓటు ఒక వజ్రాయుధం అన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ జివిఎస్.సాయిబాబు, జి.రామకృష్ణ, ఎన్ఎస్ పిఒ యాకోబు, నెహ్రూ యువజన కేంద్రం వాలంటీర్ కోసూరి రాజేష్ పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సోనియా

జగనన్న సురక్షను వినియోగించుకోండి

ప్రజాశక్తి - నరసాపురం

జగనన్న సురక్ష శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌టిఆర్ కాలనీ యుపిహెచ్‌సి డాక్టర్ పి.సోనియా అన్నారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీలోని యుపిహెచ్‌సి వద్ద సురక్ష పేజ్-2 శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. శిబిరంలో ప్రజలకు వైద్య సేవలందించినట్లు యుపిహెచ్‌సి డాక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతా వైఫల్యం పై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - ఆచంట

ప్రధాని మోడీ హాజరైన చిలకలూరిపేట బొప్పాడి ప్రజాగళం సభ భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ తక్షణం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సభలో లక్షలాది మంది జనం తోసుకొస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడడం దుర్మార్గమని అన్నారు. ఎన్నికలు కోడ్ అమల్లో ఉండగా ఐపిఎస్, ఐఎఎస్ అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఏపీ ప్రభుత్వంపై ప్రజాగ్రహం ఏ స్థాయిలో ఉందో చిలకలూరి సభ ద్వారా తెలుస్తోందన్నారు.

ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ

ఆకివీడు: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత, కళాశాల ప్రణాళిక అభివృద్ధి కమిటీ కార్యదర్శి పిబి.ప్రతాప్ కుమార్ తెలిపారు. పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు డేటా ఎంట్రీ కోర్స్‌లో మూడు నెలల శిక్షణ పొందొచ్చన్నారు. అదేవిధంగా ఐదో తరగతి పాసైన మహిళలకు ప్రత్యేక టైలరింగ్ శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఈ శిక్షణ కాలపరిమితి మూడు నెలలు ఉంటుందని తెలిపారు. కోర్సుల్లో శిక్షణ పొందాలనుకునేవారు నేరుగా కళాశాలలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఫోన్లో సంప్రదించదలచిన వారు 86885 94244 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల కోసం సంక్షేమ పథకాలు అమలు

రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

భీమవరం రూరల్: విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తును కల్పిస్తుంది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన సుమారు వంద మంది ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తండ్రి బాటలో నడుస్తూ విద్యార్థుల కోసం వేల కోట్ల నిధులను సంక్షేమ పథకాల రూపంలో అందించారన్నారు. జగనన్న విద్యా దీవెన, అమ్మ ఒడి, విద్యా కానుక, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన లాంటి అనేక పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కిందన్నారు. రాజకీయాల్లో యువరక్తం ఉండాలని ప్రకటిస్తున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భీమవరంలో పులపర్తి అంజిబాబును యువకుడిగా గుర్తించడం ఆయనకే చెల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, గొట్టుముక్కల పద్మరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎఎస్.రాజు పాల్గొన్నారు.

భీమలాపురంలో చెరుకువాడ పాదయాత్ర

ప్రజాశక్తి - ఆచంట

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అర్హులైన లబ్ధిదారులకు ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించారని ఎంఎల్ఎ రంగనాథరాజు అన్నారు. బుధవారం కోడేరు, భీమలాపురం గ్రామాల్లో ఎన్నికల శంఖారావం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన నవరత్నాల హామీతో పాటు అన్ని వర్గాల ప్రజలకూ జగన్మోహన్ రెడ్డి రికార్డ్ స్థాయిలో సంక్షేమ పథకాలను అందించారన్నారు. రానున్న రోజుల్లో నియోజవర్గంలోని అన్ని గ్రామాలనూ మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తూ ముందుకెళ్తామన్నారు.


ఆచంట : ప్రచారం చేస్తున్న ఎంఎల్ఎ చెరుకువాడ

ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, మండల అధ్యక్షులు జక్కంశెట్టి చంటి, సత్యనారాయణ రామకృష్ణ పాల్గొన్నారు.

మొగల్తూరు: వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన సాగిస్తోందని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా మొదటి రోజు బుధవారం ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్‌తో కలిసి ప్రసాదరాజు ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రచారంలో నరసాపురం మున్సిపల్ ఛైర్మన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమాని నాగరాజు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు కొట్టు పరామర్శ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం ఇటీవల మరణించిన వారి కుటుంబాలను కలిసి పరామర్శించారు. ముందుగా పట్టణంలోని వాసవీ ఇంజినీరింగ్ కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ చలంచర్ల సుబ్బారావు సతీమణి సాయి నవభారతి ఇటీవల కన్ను మూశారు. దీంతో సుబ్బారావును కలిసి మంత్రి కొట్టు పరామర్శించారు. ఆమె చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పెంటపాడు గ్రామ మాజీ సర్పంచి నల్లిమిల్లి చిన్న వెంకటరెడ్డి సతీమణి అన్నపూర్ణ ఇటీవల కన్ను మూయడంతో మంత్రి కొట్టు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట పెంటపాడు ఉపసర్పంచి కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, పెంటపాడు మండలం యూత్ ప్రెసిడెంట్ కొవ్వూరి విజయభాస్కర్ రెడ్డి, ఎంపిటిసి రెడ్డి సూరిబాబు, వైసిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.


బాధితులను పరామర్శిస్తున్న కొట్టు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి : నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన, టిడిపి, బిజెపి కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుతాయని జనసేన నరసాపురం ఉమ్మడి అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని 23వ వార్డు రాయపేటలో జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయానని, అప్పటి నుంచి ప్రజా సమస్యలపై గళం వినిపిస్తున్నాని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఘంటా కృష్ణ, పోలిశెట్టి నళిని, అడబాల రమేష్, కోటిపల్లి వెంకటేశ్వరరావు, గుబ్బల మార్రాజు, బందెల రవీంద్ర పాల్గొన్నారు.

తెలుగు యువత నియోజకవర్గ జనరల్ సెక్రటరీగా మూర్తి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జీ) ఆదేశాల మేరకు తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు గంధం సతీష్ అధ్వర్యంలో తెలుగు యువత జనరల్ సెక్రటరీగా గారపాక మూర్తికి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వలవల బాబ్జీ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పోతుల అన్నవరం, పరిమి రవికుమార్, కిలపర్తి వెంకట్రావు, ముత్యాల సత్యనారాయణ పాల్గొన్నారు.

22 నుంచి సిఐటియు వైజ్ఞానిక తరగతులు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఈ నెల 22వ తేదీ నుంచి జరిగే సిఐటియు రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక అమరవీరుల భవనంలో జరిగిన ముఖ్యుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రతాప్ మాట్లాడారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కార్మికులు, ఉద్యోగుల జీవితాల్లో ఆనందం లేకుండా పోయిందన్నారు. సంపద సృష్టికర్తలైన కార్మికులకు నేటికీ కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటివి పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలు కార్పొరేట్లకు అనుకూలంగా మార్చడం సిగ్గు చేటన్నారు. ఎన్‌జిఒ హోంలో 22వ తేదీ నుంచి జరిగే ఈ తరగతులకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఉపాధ్యక్షులు కె.ఉమా మహేశ్వరరావు, డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ తదితరులు పాల్గొనున్నారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఎన్.ఆదినారాయణ బాబు, గుబ్బల గోపి, పి.దక్షిణామూర్తి, అజయ కుమారి పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

తాడేపల్లిగూడెం : గూడెంలో అధికార వైసిపి పార్టీ అరాచకాలకు ప్రజలు భయపడి జనసేనలోకి వస్తున్నారని జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైసిపి పట్టణ మాజీ అధ్యక్షులు దాగరపు నాగు మంగళవారం రాత్రి జనసేనలో చేరారు. అయినతో పాటు సుమారు 200 తన అనుచరులను బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ దాచుకోవడం, దోచుకోవడం అనే విధంగా తయారైందన్నారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు, నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ధ్యానాంజనేయ విగ్రహ ప్రతిష్టలో రామరాజు

ఉండి: దైవ కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే భాస్కర్‌రాజు కుటుంబానికి స్వామి వారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. ఉండి భవానీపేటలోని రామ కొండరాజు కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన ధ్యానాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో ఎంఎల్ఎ మంతెన రామరాజు, జనసేన ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు పాల్గొని మాట్లాడారు. సూర్య భాస్కరరాజు కుటుంబీకులు సొంత నిధులతో స్వామివారి అమత శిల విగ్రహ చర ప్రతిష్ట మహోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం అఖండ సమారాధన నిర్వహించారు.

గణపవరం : గణపవరం, అర్ధవరం గ్రామాల్లోని సంతోషిమాత విగ్రహ ప్రతిష్టలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు పాల్గొన్నారు.

23న ఆక్వారైతుల చలో భీమవరం వాయిదా

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈనెల 23న చలో భీమవరం కార్యక్రమాన్ని తాత్కాలికంగా విరమించినట్లు జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు చెప్పారు. స్థానిక ఎస్ఎస్ఎస్ కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన ఆక్వా రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున చలో భీమవరాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ప్రకటించారు. త్వరలో పాలకొల్లులో 2000 మంది ఆక్వా రైతులతో సమావేశం ఏర్పాటు చేసి భీమవరంలో 25 వేల రైతులతో చలో భీమవరం కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆక్వా రైతుల్లో ఐకమత్యంలేక నష్టాల ఊబిలో రైతులు కూరుకుపోతున్నారని, కనీసం సమావేశాలకు రైతులు రాకపోవడం పట్ల పలువురు రైతు ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క రొయ్య ధర తగ్గిపోతూ ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఫీడ్, సీడ్ ధరలు దారుణంగా పెరుగుతూ రైతులు నష్టాలు ఊబిలో ఉంటున్నారని, పోరాటం లేకపోతే రైతుల మనుగడ కష్టమని సంఘ ఉపాధ్యక్షులు రుద్రరాజు సత్యనారాయణ రాజు చెప్పారు. ఆక్వా రైతులు క్రాప్ హాలిడే ప్రకటిస్తేనే రొయ్య ఉత్పత్తి తగ్గి, డిమాండ్ ఉంటుందని ప్రధాన కార్యదర్శి బోనం చిన బాబు చెప్పారు. పోరాటం ద్వారానే ప్రభుత్వం రైతులకు విద్యుత్ సబ్సిడీ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తుందని సంఘ నూతన ఉపాధ్యక్షులుగా నియమితులైన పెన్మెత్స సత్యనారాయణ రాజు చెప్పారు. ఇంకా పలువురు రైతు ప్రతినిధులు రైతులు నష్టాలు ఊబి నుంచి గట్టెక్కాలంటే ఐకమత్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు. ఇంకా జాన్ రాజు, గొట్టుముక్కల సూర్య నారాయణరాజు మాట్లాడారు.

ఆక్వా ఫ్యాక్టరీకి నోటీసులు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పాలకొల్లు రోడ్డులో ఉన్న సిరి ఆక్వా ఇస్ లింక్స్ ఆక్వా ఫ్యాక్టరీ వారు వదులుతున్న కలుషిత నీరు చిట్టవరం మైనర్ డ్రెయినేజీ ద్వారా గోదావరిలో కలిసి మత్స్య సంపద దెబ్బతింటుందని పట్టణానికి చెందిన బొడ్డు కృష్ణ భగవాన్ ఇటీవల జరిగిన స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు నర్సాపురం డ్రెయినేజీ విభాగం అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ కె.పావన్య బుధవారం పరిశీలించి వివరణ పత్రాన్ని భగవాన్‌కు అందజేశారు. సిరి ఆక్వా ఇస్ లింక్స్ ఫ్యాక్టరీ ద్వారా వచ్చిన మురుగునీరు చిట్టవరం, సరిపల్లి డ్రెయినేజీ ద్వారా కలుస్తుందని, పొల్యూషన్ బోర్డు వారు మురుగునీరు శాంపిల్స్ తీసుకున్నారని, సిరి ఐస్ లింక్స్ వారికి నోటీసులు అందించామని వివరణ పత్రంలో కె.పావన్య పేర్కొన్నట్లు భగవాన్ తెలిపారు.

పాతపాడుకు ప్రదర్శనగా వైసిపి నేతలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన లోకం వెంకటేశ్వరరావు (నాని) ద్విచక్ర వాహనాలపై ప్రదర్శనగా పాతపాడు గ్రామానికి బుధవారం బయలుదేరి వెళ్లారు. వైసిపి ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా మొదటిరోజు పాతపాడు గ్రామంలో చేస్తున్న ఎన్నికల ప్రచారానికి నాని ఆధ్వర్యంలో సుమారు 100 బైక్‌లపై కార్యకర్తలతో ప్రదర్శనగా పాతపాడు వెళ్లారు. అక్కడ ముదునూరి ప్రసాదరాజు చేపట్టిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

ఫోన్ చేస్తానని చెప్పి..

ప్రజాశక్తి - నరసాపురం

ఫోన్ చేసుకుంటాను అని చెప్పి ఫోన్‌తో వ్యక్తి పరారైన సంఘటన నరసాపురంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నరసాపురం మున్సిపాల్టీలో శానిటేషన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న నల్లి చిత్రసేన బుధవారం ఉదయం 5 గంటలకు రాయపేటలో జెసికిలీ రోడ్డులోకి విధుల నిమిత్తం వచ్చారు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఆయన దగ్గరకు వచ్చి మా అబ్బాయి జాతరలో తప్పిపోయాడు ఒక్కసారి మీ ఫోన్ ఇవ్వండి కాల్ చేసుకుంటానని అడిగారు. శానిటేషన్ డ్రైవర్ వారికి ఫోన్ ఇచ్చాడు. తర్వాత ఫోన్ చేస్తున్నట్లు నటించి ఫోన్‌తో బైక్‌పై పరారయ్యారు. దీనిపై బాధితుడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

అయితే రాయపేటలో మున్సిపల్ శానిటరీ డ్రైవర్ నల్లి చిత్రసేన నుండి ఫోన్ దొంగ దొరికాడు. పట్టణంలో టైలర్ పేటలో ఓ షాప్‌లో మొబైల్ అమ్మకానికి తీసుకెళ్లాడు. ఉదయం నుంచి ఫోన్ పోయిందనే న్యూస్ పలు వాట్సప్ గ్రూప్‌ల్లో చక్కర్లు కొట్టింది. దీంతో షాప్ యజమాని గమనించి మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించారు. ఆ యువకుడు నరసాపురం పట్టణం వైసిపి కాలనీకి చెందిన పండుగా గుర్తించారు. దీంతో వచ్చిన తన ఫోన్ అని నిర్ధారణ చేసుకుని ఆ యువకుడుని మందలించి విడిచి పెట్టినట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు గ్రామానికి చెందిన సాలా కృష్ణ (21) ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. కృష్ణ తన స్నేహితుడు టీస్టాల్ పెట్టుకునే నిమిత్తం మంగళవారం రాత్రి ఫ్లెక్సీ కడుతున్నారు. ఆ సమయంలో ఫ్లెక్సీ కర్రలు విద్యుత్ తీగలకు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడు అరుణ్‌కుమార్ స్వల్ప గాయాలకు గురై పాలకొల్లు ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తండ్రి సాలా ఏసు ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు'

ప్రజాశక్తి - మొగల్తూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారని చీఫ్‌విప్ ముదునూరి.ప్రసాద్ రాజు అన్నారు. బుధవారం కాళీపట్నం తూర్పు గ్రామానికి చెందిన పాలపర్తి ప్రసాద్, కొలవర్తి మరియా బాబు, బత్తుల ఏసు, పాలపర్తి చక్రవర్తి, కోల్లాటి సంజీవరావు, నేతల సుబ్బారావు, మండ సువర్ణరాజు, అశోక్, ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది పార్టీలో చేరడంతో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్న జగన్‌దే అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, వైసిపి నాయకులు ముదునూరి శ్రీ కృష్ణంరాజు, రేవు రాంబాబు, తణుకుల వెంకన్న, కవురు పెద్దిరాజు, పూతినేని నాగ సత్యనారాయణ పాల్గొన్నారు.